సంతలో సమస్యల తిష్ట


పెదబయలు సంతలో షెడ్లు లేక కర్రలతో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలు


సంతలో పిప్పళ్ల అమ్మకాలు

- వారపు సంతలో కానరాని మౌలిక సదుపాయాలు
- తాగునీటి ఇక్కట్లు
- మార్కెట్ షెడ్లు లేక రైతుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

పెదబయలు: మన్యంలోని వారపు సంతల్లో కనీస సదుపాయాలు కరువయ్యాయి. సంతలో షెడ్లు, తాగునీరు సదుపాయం లేక సంతకు వచ్చిన గిరిజనులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మన్యంలో పెద్ద వారపు పిప్పళ్లు ,పసుపు మార్కెట్ కలిగిన పెదబయలు వారపు సంతలో కనీస సదుపాయాలు లేవు. అలాగే రూడకోట, గోమంగి, బొయితిల, భూషిపుట్టు సంతల్లో షెడ్లు ఇప్పటి వరకు నిర్మించలేదు. దీంతో గిరిజన రైతులు తాము పండించిన పసుపు, పిప్పళ్లు, అపరాలు, కూరగాయలు పంటలు అమ్మకానికి తెచ్చి సంతల్లో గొడుగుల నీడలో రోజంతా కూర్చొని విక్రయించి, తిరిగి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాకాలంలో షెడ్లు లేక గిరిజనులు సంతకు తీసుకొచ్చిన సరకులు తడిచి నష్టపోవడం పరిపాటిగా మారింది. ప్రతీవారం పాడేరు మార్కెట్ యార్డు అధికారులు రైతులు, వ్యాపారుల నుంచి కొంతమేర రేటు వసూలు చేస్తున్నారు.ఇదే సంతకు సంబంధించి సీతగుంటలో ఏటా సంత ఆశీలు వేలంపాట నిర్వహిస్తోంది. ఏటా రూ.3లక్షల నుంచి రూ.5 లక్షల వరకు సంత ఆశీలు వేలంపాట జరుగుతుంది. అయితే సంతల్లో కనీస సదుపాయాలు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.40 లక్షలతో షెడ్డును నిర్మించారు. సంతకు వచ్చేవారికి దాహార్తి తీర్చేందుకు చేతిబోరు ఏర్పాటుచేసినా తాగునీరు అందేలా ఐటీడీఏ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో సంతలో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. సంతల్లో రహదారి


ప్లాస్టిక్ బాటిల్‌లో నీరు తెచ్చుకుంటున్న గిరిజన మహిళ

గోతులతో నిండి ఉందని పలువురు చెబుతున్నారు. వర్షం పడితే చిత్తడిగా మారుతుందని, నడవడానికి కూడా ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. వారం వారం వేలాది మంది సంతకు ఆంధ్ర, ఒడిశా నుంచి ప్రజలు వస్తున్నారు. ప్రభుత్వం స్పందించి సంతలో సంతషెడ్లు, గిరిజనులు పండించిన సరుకులు నిల్వకు గోదాములు, తాగునీటి సదుపాయం కల్పించాల్సి ఉంది.

షెడ్లు ఏర్పాటు చేయాలి



మన్యంలో ఉన్న ప్రతీ వారపు సంతలో దుకాణ సముదాయాలు(షెడ్లు), రక్షిత తాగునీటి సదుపాయం కల్పించాల్సి ఉంది. స్థానిక వారపు సంతల్లో కోట్లలో వ్యాపారం జరుగుతోంది. కనీస సదుపాయాలు లేవు. దీంతో నిత్యం ప్రజలు అవస్థలు పడుతు ఉన్నారు. మార్కెట్ యార్డు అధికారులు, ఐటీడీఏ స్పందించి సంతల్లో షెడ్లు, తాగునీరు కల్పించే లక్ష్యంగా శాశ్వతంగా తీర్చాల్సి ఉంది.

– చీపురు చిట్టిబాబు, రైతు, పర్రెడ గ్రామం, పెదబయలు మండలం

జీసీసీ సూపర్‌బజార్లు ఏర్పాటు చేయాలి



సంతల్లో ఎక్కువగా నకిలీ వస్తువులు అమ్మకాలు జరుగుతుంది. అయితే పెద్ద సంతల్లో జీసీసీ ఆధ్వర్యంలో జీసీసీ సూపర్ మార్కెట్లు ఏర్పాటు చేస్తే జీసీసీకి లాభాలతో పాటుగా గిరిజనులకు నకిలీ వస్తువుల కొనుగోలు బెడద తగ్గుతుంది. సంతల్లో తాగునీటి సదుపాయం కల్పించాలి. నీటి కోసం అవస్థలు పడుతున్నారు. మార్కెటింగ్ యార్డు, ఐటీడీఏ అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

– పల్టాసింగి విష్ణుమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు, పెదబయలు మండలం

ప్రతిపాదనలు పంపాం



ఎండలు ఎక్కువగా ఉన్నందున పెదబయలు వారపు సంతలో సోమవారం రోజు 3 నుంచి నాలుగు చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ మేరకు శాశ్వతంగా తాగునీటి కల్పనకు కృషి చేస్తాం. సంతలో మరుగుదొడ్ల సమస్య ఉన్నతాధికారులకు నివేదించాం. మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. అన్ని సమస్యలు దశల వారీగా పరిష్కారిస్తాం

– ఎల్.పూర్ణయ్య, ఎంపీడీఓ, మండల పరిషత్ పెదబయలు మండలం.

క్లుప్తంగా

వర్మీకంపోస్టు యూనిట్ల పరిశీలన


సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో కుమార్

అనంతగిరి(అరకులోయటౌన్): అనంతగిరి మండలంలోని ఎగువశోభ పంచాయతీలో శుక్రవారం ఎంపీడీవో ఏ.వి.వి.కుమార్ పర్యటించారు. గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని, తడి చెత్త, పొడి చెత్త సేకరణను పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణపై ఆరా తీశారు. పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో చెత్త సేకరణ సాధ్యం కాకపోతే చిన్న చిన్న గోతులు ఏర్పాటు చేసి అందులో చెత్త వేయించాలని కార్యదర్శి దేవాకు సూచించారు. పారిశుధ్యంపై దృష్టి సారించి ప్రజలకు ఎటువంటి అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

వాలీబాల్ కిట్లు అందజేత


పనసపుట్టులో వాలీబాల్ కిట్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు శంకర్

దుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ పనసపుట్టులో శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి మఠం శంకర్ ఆధ్వర్యంలో యువతకు వాలీబాల్ కిట్లును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఉన్నత విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి కనబర్చాలన్నారు. నాయకుడు విజయదశమి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెందిన ఎద్దు


కొయ్యూరు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకిన ఎద్దు షాక్‌కు గురై మృతిచెందింది. స్తంభానికి చుట్టు రక్షణ వలయం ఏర్పాటు చేయకపోవడంతో ఎద్దు దానిని తాకి మరణించింది . బూదరాళ్ల పంచాయతీ అన్నవరంకు చెందిన తాంబెల రమేష్‌కు చెందిన దుక్కిటెద్దు శుక్రవారం గ్రామానికి సమీపంలో సంచరిస్తూ అక్కడ బీఎస్ఎన్ఎల్ టవర్‌కు విద్యుత్ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ తాకింది. దానికి అమర్చిన తీగలకు విద్యుత్ సరఫరా ఉండడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే ఎద్దు మరణించింది. దుక్కిటెద్దు మృతి చెందడంతో బతుకుదెరువు లేదని, అధికారులు ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

మైనింగ్ మాఫియాపై చర్యలకు డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

చింతూరు: గ్రామసభల ఆమోదం లేకుండా ఏజెన్సీలో తెల్లరాయి తవ్వకాలు జరుపుతున్న మాఫియాపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. చింతూరులో శుక్రవారం జరిగిన సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్, సీసం సురేష్ మాట్లాడుతూ ఏజెన్సీలో మౌలిక సౌకర్యాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మన్యంలో లక్షల విలువ చేసే సంపదను మైనింగ్ మాఫియా కొల్లగొడుతుంటే అధికారులు వారికి అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు

వీఆర్‌ఏల వినతి


తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న వీఆర్‌ఏలు

వై.రామవరం: మండలంలోని వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ పి.వేణుగోపాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని వీఆర్‌ఏలు కోరారు. సీఐటీయూ నేత శాంతిరాజు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


బస్టాండు ఆవరణలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అసిస్టెంట్ కమాండెంట్

వై.రామవరం: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని స్థానిక బస్టాండు ఆవరణలో సీఆర్‌పీఎఫ్ జి–42 బెటాలియన్ అదనపు పోలీసు బలగాల ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. స్థానిక ఎస్ఐ బి.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలలో బెటాలియన్ అసిస్టెంటు కమాండెంట్ రాధ పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. చలివేంద్రాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉన్నత స్థానాలకు ఎదగాలి


కి మాట్లాడుతున్న సీడీపీవో సుధ

అడ్డతీగల: బాల్య దశ నుంచి చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థానాలకు ఎదగాలని అడ్డతీగల ఐసీడీఎస్ సీడీపీవో వై.సుధ అన్నారు. అడ్డతీగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కిశోరి వికాసం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.బాలికలు 25 ఏళ్ళు వచ్చాక వివాహం చేసుకోవాలన్నారు.18 ఏళ్లలోపు బాల్య వివాహం చట్టరీత్యా నేరమన్నారు. మైనర్ వివాహాల వల్ల అనారోగ్య సమస్యలతో పాటు శారీరక సమస్యలు తెలెత్తుతాయన్నారు. బాల్య వివాహాలను అడ్డుకోవాలన్నారు. అటువంటి సమాచారం ఐసీడీఎస్ అధికారులకు ఇస్తే అండగా ఉంటామన్నారు.ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు,సౌకర్యాలను ఉపయోగించుకుని ఉన్నత విద్య అభ్యసించి, ఉద్యోగాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు.సూపర్‌వైజర్ పావని తదితరులు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలి


ఆందోళన చేస్తున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి, బుడ్డపనస గిరిజనులు

ముంచంగిపుట్టు: మండలంలోని రంగబయలు పంచాయతీ బుడ్డపనస గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి అన్నారు. బుడ్డపనస గ్రామాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. ఇంటింటికి తిరిగి గిరిజనుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. సరైన రహదారి లేక అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నామని, నూతన మంజూరైన గృహాలు నిర్మించుకోలేకపోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రహదారి నిర్మించాలని ఆందోళన కార్యక్రమం చేశారు. వైస్ ఎంపీపీ భాగ్యవతి మాట్లాడుతూ గతంలో రహదారి మంజూరైనప్పటికీ నేటికి నిర్మించకపోవడం దారుణమన్నారు. రహదారి సమస్యతో సంక్షేమ పథకాలతో పాటు అత్యవసర పరిస్థితిలో రోగులను ఆస్పత్రికి తీసుకువచ్చేందుకు డోలీ మోతే దిక్కుగా మారుతుందన్నారు. రేషన్ సరకులకు మోత తప్పడం లేదని, రహదారి సమస్య గ్రామస్తులను వేధస్తుందని, తక్షణమే ప్రభుత్వం స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలని ఆమె కోరారు.

మూఢనమ్మకాలను విడనాడాలి


కోసంగిలో గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ పాపినాయుడు


దుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ కోసంగి గ్రామంలో పోలీసు, రెవెన్యూ, మెడికల్, ఐసీడీఎస్, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలిసి ఎస్ఐ కె.పాపినాయుడు శుక్రవారం పర్యటించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిల్లంగి, చెడుపు వంటి మూఢనమ్మకాలను వీడనాడాలన్నారు. ప్రస్తుతం గిరిజన సమాజంలో మూఢనమ్మకాల వలన అమాయక గిరిజనుల ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరికైనా అనారోగ్యం వస్తే ముందుగా వైద్యులను సంప్రదించాలని అంతే తప్ప పసరమందులు, మూఢ నమ్మకాల జోలికి వెళ్లొద్దని వివరించారు. రెవెన్యూ శాఖ సీనియర్ అసిస్టెంట్ జి.కోటి, దుంబ్రిగుడ వైద్యాధికారి డాక్టర్ అంబికా రమణి, ఆర్ఐ బి.పి.ఎం.రాజు, ఎంపీహెచ్ఈవో రామరావు, హెల్త్ అసిస్టెంట్ శెట్టి స్వామి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నం


నెల్లిమెట్ల గ్రామంలో జేఏసీ నాయకుల సమావేశం జరుగుతున్న దృశ్యం


రాజవొమ్మంగి: మండలంలోని నెల్లిమెట్ల గ్రామంలోఆదివాసీ జేఏసీ నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న జేఏసీ నాయకుడు బాలకృష్ణ, పీసా కమిటీ మండల అధ్యక్షుడు సూరిబాబు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలను కార్పొరేట్లకు కట్టబట్టే ప్రయత్నాన్ని ప్రభుత్వం , ప్రజాప్రతినిధులు, అధికారులు విరమించుకోవాలన్నారు. రంపచోడవరం ఐటీడీఏలో ఈ నెల 9న జరిగిన వర్క్‌షాపు కార్యక్రమంలో టూరిజం అభివృద్ధి చెందితే హోటళ్లు, బార్లు వస్తాయని, గిరిజన యువతకు ఉద్యోగాలు లభిస్తాయని చెప్పడం హాస్యాస్పదమని విమర్శించారు. ఆదివాసీల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలోకి కార్పొరేట్ సంస్థలను అనుమతించి భూగర్భ సంపద కొల్లగొట్టే ప్రయత్నాలను ఆదివాసీలు తిప్పికొట్టాలని పిలుపు ఇచ్చారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ధర్నా


ధర్నా చేస్తున్న మహిళలు

చింతపల్లి: మండల కేంద్రంలోని అంతర్ల గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమాన్ని మహిళలు నిర్వహించారు. శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతున్న నేపథ్యంలో చింతపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని అంతర్ల గ్రామ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గడిచిన రెండు వారాలుగా తమ గ్రామానికి తాగునీటి పథకం పనిచేయక పోవడంతో తాగునీటికి అనేక ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సర్పంచ్ దురియా పుష్పలత, కార్యదర్శి శ్రీధర్‌లు స్పందించి, రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో స్థానికులు ధర్నా కార్యక్రమాన్ని విరమించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల ఆందోళన


ధర్నా చేస్తున్న ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు

పాడేరు రూరల్: ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాడేరులో శుక్రవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ కిరణ్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్ఆర్ అమలుచేయాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ఐటీడీఏ అధికారులను వినతి పత్రలు అందజేశారు. త్రినాథ్, రామస్వామి, సురేష్ పాల్గొన్నారు.

చదువుపై దృష్టి సారించాలి

రంపచోడవరం: ఏజెన్సీలో కిశోర బాలికలు చదువుపై దృష్టి సారించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. రంపచోడవరంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కిశోర వికాసం కార్యక్రమంలో పీవో సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీలు పాల్గొన్నారు. పీవో సింహాచలం మాట్లాడుతూ బాలికలు బాగా చదివాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించాలన్నారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ బాలురతో సమానంగా బాలికలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలని ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులను ఆదేశించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో రమణి

చింతపల్లి; మండలంలో అన్ని గ్రామాల్లోను బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రజాప్రతినిధులతో పాటు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలాని ఐసీడీఎస్ సీడీపీవో జి.వి.రమణి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బాల్య వివాహాల వల్ల అనర్థాలపై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లా ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్లు విజయకుమారి, జౌహర్‌ఉన్నీషా తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవానికి పందిరి రాట

హుకుంపేట: మన్యం ప్రజల ఆరాధ్యదైవం మోదకొండమ్మ అమ్మవారి ఉత్సవం సందర్భంగా సతకంపట్టు వద్ద పందిరి రాట ఉత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షురాలు సమిడ వెంకటపూర్ణిమ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి అనిల్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని జరిపారు.

ఈ సందర్భంగా సర్పంచ్ పూర్ణిమ మాట్లాడుతు మోదకొండమ్మ జాతర మహోత్సవాలను వచ్చే నెల 11,12,13 తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వైస్ సర్పంచ్ గోవింద్ , ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

అడ్డతీగల: మండలంలోని డి.భీమవరం, ఎల్లవరం, అడ్డతీగల–1, 2 గ్రామ సచివాలయాలను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష అన్నారు. కొంత మంది సిబ్బంది ఇష్టానుసారమైన సమయాల్లో కార్యాలయాలకు వస్తున్నారన్నారు. ఆన్‌లైన్‌లో హాజరు వేసుకుని రిజిష్టర్‌లో సంతకాలు లేకపోవడంతో ఆమె అసహనం వ్యక్తం చేశారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలతో గౌరవంగా మాట్లాడి సమస్యలు పరిష్కరించాలన్నారు. డి.భీమవరం ఆశ్రమ పాఠశాలను సందర్శించి మెనూ అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకుని వారితో కలిసి భోజనం చేశారు. నాయకుడు విజయభాస్కర్ తదితరులున్నారు. అనంతరం మండల కేంద్రంలోని రెండు మద్యం దుకాణాలను ఎమ్మెల్యే శిరీష తనిఖీ చేశారు. మద్యం దుకాణాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరల కన్నా అధిక ధరలకు విక్రయించొద్దని దుకాణదారులకు సూచించారు. దుకాణాల వద్ద ధరల పట్టిక ప్రదర్శించాలన్నారు.

సమస్యలపై ఎంపీకి వినతులు


ఎంపీ తనూజారాణికి వినతులు ఇస్తున్న క్రైస్తవ సంఘాల నేతలు

చింతపల్లి: చింతపల్లిలో ముత్యాలమ్మ తల్లి జాతరను విజయవంతం చేయాలని అరకు ఎంపీ తనూజారాణి అన్నారు. శుక్రవారం చింతపల్లి వచ్చిన ఆమెకు క్రైస్తవ, హిందూ, ముస్లిం సంఘాల నాయకులు వేర్వేరుగా కలిసి పలు సమస్యలపై వినతులు ఇచ్చారు. ఆమె సమస్యలపై సానుకూలంగా స్పందించారు. మతాలకతీతంగా నిర్వహిస్తున్న ముత్యాలమ్మ తల్లి జాతర ఉత్సవాన్ని విజయవంతం చేసేందుకు అందరూ సమష్టిగా పనిచేయాలని ఆమె కోరారు. ఉత్సవ కమిటీ అధ్యక్ష , కార్యదర్శులు దురియా హేమంత్‌కుమార్, పసుపులేటి వినాయకరావుల ఆధ్వర్యంలో ఉత్సవ నిర్వహణకు విరాళాల సేకరణ చేపట్టారు.

15, 16 తేదీల్లో బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

అడ్డతీగల: బిసి కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 15,16 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.ఆర్.విజయ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలవ్యాప్తంగా స్వయం ఉపాధి కోసం 385 మంది దర ఖాస్తు చేసుకున్నారన్నారు. బ్యాంకు మేనేజర్లు, బీసీ కార్పొరేషన్ అధికారుల సమక్షంలో నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. మూడు సెట్లు దరఖాస్తులు ఇవ్వనివారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల,ఆధాయ ధ్రువీకరణ పత్రాలు జెరాక్స్ కాపీలను తీసుకురావాలన్నారు. వాహనాల కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థులు డ్రైవింగ్ లైసెన్స్ జెరాక్స్ మూడు సెట్లు తీసుకురావాలని సూచించారు. దీంతో పాటు ఒరిజినల్ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల, ఆధాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

ఏడు పాఠశాలలకు వసతి గృహాలు


త్రినాథరావు, ఎంఈవో, అరకు

అరకులోయటౌన్: మండలంలో ఏడు పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వ నిధులతో వసతి గృహాలు మంజూరైనట్టు ఎంఈవో వంతాల త్రినాథరావు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని రణజిల్లెడ, చొంపి, మాడగడ, చినలబుడు, వంతుమూరు ప్రాథమిక పాఠశాలలతో పాటు సుంకరమెట్ట, నందివలస(ములియగలుగు) ప్రాథమికోన్నత పాఠశాలలకు వసతి గృహాలు మంజూరైనట్టు చెప్పారు. ఈ మేరకు స్థల సేకరణ కోసం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి ఎకరం స్థలానికి ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ (ఎల్‌పీసీ) మంజూరు తరువాత ఇంజినీరింగ్ అధికారులు వసతి గృహం, పాఠశాల తరగతి గదులు, సిబ్బంది నివాస గృహాల నిర్మాణాలకు అంచనా తయారు చేసిన తరువాత పనులు ప్రారంభిస్తారన్నారు. ఈ పాఠశాలలకు వసతి గృహాలు మంజూరైతే స్థానిక విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మాదల పంచాయతీ నందివలస ప్రాథమికోన్నత పాఠశాలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలగా మారుస్తున్నట్టు ఎంఈఓ త్రినాథరావు తెలిపారు.

నేటి నుంచి అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవాలు


అయ్యప్ప స్వామి దేవాలయం

సీలేరు: మన్యం శబరిమలగా పేరుగాంచిన అయ్యప్ప స్వామి దేవాలయం వార్షికోత్సవాన్ని ఈనెల 12,13,14 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ నిర్ణయించిందని అర్చకుడు దామోదరం తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, మండపారాధనతో ప్రారంభమై సాయంత్రం స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆదివారం ఉదయం పూజాది క్రతువులు, సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు ,పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమం జరుగుతుందని, సాయంత్రం 6 గంటలకు పడిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

పాడేరులో సీహెచ్‌డబ్ల్యూల ధర్నా


ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తున్న సీహెచ్‌డబ్ల్యూలు

పాడేరు రూరల్: సీహెచ్‌డబ్ల్యూలను ఆశ కార్యకర్తలుగా మార్పు చేయాలని శుక్రవారం పాడేరు ఐటీడీఏ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతు పాడేరు డివిజన్ పరిధిలో 720 మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పనిచేస్తున్నరని, వారిని ఆశ కార్యకర్తలుగా మార్పు చేయాలన్నారు. ప్రభుత్వం ఆశ కార్యకర్తలకు రూ.10వేలు, సీహెచ్‌డబ్ల్యూలకు రూ.4000 వేతనం చెల్లించడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. వీరి ఇద్దరి పని స్వభావం ఒక్కటేనన్నారు. సంఘం నాయకులు పద్మ, పార్వతి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.